ఉత్తరం కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
గురువారం, 03 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 20 | పేజీలు: 6 వెల: 5

## పాలంపేట 'గొల్లల గుడి'కి జాతీయ గుర్తింపు!

- జాతీయ ప్రాధాన్య కట్టడంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటన
- ఏఎస్ఐ అధికారిక గెజిట్‌లో నోటిఫికేషన్
- రామప్పలో మరో శిల్పకళా అద్భుతానికి అరుదైన గౌరవం



**కాకతీయ, ములుగు ప్రతినిధి:** కాకతీయుల శిల్పకళా వైభవానికి నిదర్శనంగా నిలిచిన ములుగు జిల్లా పాలంపేటలోని 'గొల్లల గుడి'కి అరుదైన గుర్తింపు లభించింది. ఈ ప్రాచీన ఆలయాన్ని

........(తరువాయి 2లో)

# రౌడీయిజానికి నో ఛాన్స్!

## నేర చరిత్ర ఉన్నవారిపై నిఘా ఉంచుతాం

- భూ వివాదాల కేసుల్లో ఎస్‌ఓపీనే ప్రామాణికం
- వరంగల్ పోలీసింగ్ వేరు.. అర్బన్, రూరల్ బ్యాలెన్సే ఇక్కడ కీలకం
- గంజాయిపై ఉక్కుపాదం.. 'సంఘమిత్ర'లతో సమరమే!
- ట్రాఫిక్ క్రమబద్ధీకరణ.. అవసరమైన చోట నిర్ణయం
- ప్రజల సేఫ్టీనే మొదటి లక్ష్యం.. శాఖలతో కలిసి ముందుకు
- ఫేమ్ కోసం కాదు.. ఫలితం కోసం పనిచేస్తా
- డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో వరంగల్ సీపీ శ్వేతారెడ్డి

5



"పోలీస్ అధికారిగా నాకు పేరు రావాలి.. ఫేమ్ రావాలి అనే ఆలోచన లేదు. నేను చేసే పనికి ఫలితం కనిపించాలి. ప్రజలకు భద్రత ఉందనే నమ్మకం కలగాలి. నేరస్తులకు చట్టం పట్ల భయం ఉండాలి. అదే నా పోలీసింగ్ నిర్వచనం".. వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి తన వర్క్ స్టైల్‌ను ఆవిష్కరించారు. అర్బన్, రూరల్ ప్రాంతాల ప్రత్యేకతలను సమన్వయం చేసుకుంటూ వరంగల్ పోలీసింగ్‌కు ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తున్నానని చెప్పారు. గంజాయి, రౌడీయిజం, సైబర్ క్రైం, ట్రాఫిక్, భూ వివాదాలు వంటి అంశాలతోపాటు సాంకేతికత వినియోగం, శాఖల మధ్య సమన్వయం, ప్రజల భాగస్వామ్యానికీ ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. డిజిటల్ మీడియా ప్రతినిధులు నిర్వహించిన చిట్‌చాట్‌లో వరంగల్ సీపీ శ్వేతారెడ్డి వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో అమలు చేస్తున్న పోలీస్ విధానాలపై కొన్నింటిని చిట్‌చాట్‌లో వెల్లడించారు. ఆ వివరాలు సీపీ మాటల్లోనే..

## రికార్డుల్లో ఒకలా.. మోకాపై మరోలా!

- వ్యవసాయ భూమిగా పట్టా.. మోకాపై వ్యవసాయేతర వినియోగం
- లేఅవుట్ చేసి 50–60 మందికి ప్లాట్ల విక్రయం?
- కోర్టు వివాదం నడుస్తుండగానే మట్టి డంపింగ్.. రైతుబంధుపైనా సందేహాలు
- అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు.. సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్



3

## గ్లోబల్ సమ్మిట్– రక్ష ఎక్స్‌పోలో భాగస్వాములు కండి

- రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం
- దేవరకద్ర డీఆర్‌డీఓ ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమి
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి మరో 750 ఎకరాలు ఇచ్చేందుకు అంగీకారం
- కేంద్ర రక్షణ శాఖ సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి



2



# సీఎంపైనే ముందుగా చర్యలు తీసుకోవాలి!

## పదేళ్లు తానే సీఎంగా ఉంటానని చెప్పడం క్రమశిక్షణ ఉల్లంఘన కాదా?

- నా రాజీనామా కోరుతూ ఎవరూ నన్ను సంప్రదించలేదు
- బీసీలకు ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయమా?
- నాపై ఆరోపణలు చేసిన వారిపైనా చర్యలు తీసుకోవాలి
- అధిష్ఠానానికి అన్ని వివరాలు రాతపూర్వకంగా ఇచ్చా
- ఖర్గేను కలిసిన అనంతరం ఢిల్లీలో మీడియాతో మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం కీలక మలుపు తిరిగింది. తనపై క్రమశిక్షణ చర్యలకు రంగం సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆమె పార్టీ అధిష్ఠానానికే సూటిగా ప్రశ్నలు సంధించారు. ''నాపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటే.. ముందుగా సీఎం రేవంత్‌రెడ్డిపైనే చర్యలు తీసుకోవాలి. పదేళ్లు తానే సీఎంగా ఉంటానని ఆయన చెప్పడం క్రమశిక్షణ ఉల్లంఘన కాదా?'' అని ప్రశ్నించారు. తన రాజీనామా కోరుతూ ఇప్పటివరకు ఎవరూ తనను సంప్రదించలేదని స్పష్టం చేశారు. తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదన్నారు. బీసీలకు ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. తనపై ఆరోపణలు చేసిన వారిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి తన వివరణ ఇచ్చిన అనంతరం ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో సురేఖ ఈ వ్యాఖ్యలు చేశారు.

**'సీఎంపైనే ముందుగా చర్యలు తీసుకోవాలి'**

మంత్రి కొండా సురేఖ తనపై క్రమశిక్షణ చర్యల అంశాన్ని నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహారంతో ముడిపెట్టారు. ''పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్‌రెడ్డి ఎలా అంటారు? అది క్రమశిక్షణ ఉల్లంఘన కాదా? ఒకవేళ నాపై చర్యలు తీసుకోవాల్సి వస్తే.. ముందుగా సీఎంపైనే చర్యలు తీసుకోవాలి'' అని ప్రశ్నించారు. పార్టీ క్రమశిక్షణ విషయంలో అందరికీ ఒకే ప్రమాణం ఉండాలని స్పష్టం చేశారు. తనపై వచ్చిన ఆరోపణల విషయంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ నోటీసు ఇవ్వడమే తప్పని పేర్కొన్నారు. తాను ఏఐసీసీ సభ్యురాలిగా ఉన్నానని, అందుకే ఢిల్లీకి వచ్చి పార్టీ పెద్దల ముందు తన వాదన వినిపించానని చెప్పారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి తన వివరణ ఇచ్చానని, కేసీ వేణుగోపాల్‌తో ఇంకా మాట్లాడలేదని తెలిపారు. పార్టీ పెద్దలు ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూస్తున్నానని చెప్పారు.

**'నా రాజీనామా కోరుతూ ఎవరూ సంప్రదించలేదు'**

తనను మంత్రి పదవి

........(తరువాయి 2లో)



## కాంగ్రెస్ వెయ్యి రోజుల ప్రజా పీడన

### తెలంగాణకు పట్టిన శనికి నేటితో వెయ్యి రోజులు

- కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలకూ అన్యాయమే
- 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా మోసం
- కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఛార్జ్‌షీట్

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఆ పార్టీ పాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదని, వెయ్యి రోజుల ప్రజా పీడన

........(తరువాయి 2లో)

## ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ఘోర వైఫల్యం

- కేసీఆర్ కట్టిన ఇల్లు.. పెట్టిన పొయ్యిలా రాష్ట్రాన్ని ఇస్తే కుప్పకూల్చారు
- విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయ రంగాలు పూర్తిగా నిర్వీర్యం
- ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది
- మాజీ మంత్రి హరీశ్‌రావు

2

## రవాణా శాఖలో పెద్ద సారు పెత్తనం!

- అధికారి విధులకు దూరంగా ఉన్నా.. ఆయన లాగిన్‌తో ధ్రువపత్రాల జారీ?
- అధికారిక లాగిన్‌ను ఇతరులు వినియోగించారా?
- నిబంధనలకు విరుద్ధంగా అధికారాల బదలాయింపు జరిగిందా?
- అధికార దుర్వినియోగంపై ఉన్నతాధికారులు విచారణ చేయాల్సిందే!



3



## ఉద్యమంలో పెద్ది పోరాటం చిరస్మరణీయం

- ఉద్యమంలో పెద్ది పోరాటం చిరస్మరణీయం
- ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన ఉద్యమకారుడు
- భావితరాలకు ఆయన పోరాటం స్ఫూర్తిదాయకం
- తెలంగాణ ఉద్యమానికి ఊపునిచ్చిన ధర్నాలు, నిరసనలు
- గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

3






# వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తాం

- ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం చేసిన మహనీయుడు
- ప్రాణహిత–చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
- వైఎస్ చివరి కోరిక రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే
- వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అవార్డ్స్ –2026 కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి




**కాకతీయ, న్యూఢిల్లీ :** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను నూటికి నూరు శాతం కొనసాగిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అవార్డ్స్–2026 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేసిన ప్రజా సంక్షేమ విధానాలు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన రైతు, సాగునీటి సంక్షేమ కార్యక్రమాలను సీఎం గుర్తుచేశారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించేందుకు తొలి సంతకం చేసిన

........(తరువాయి 2లో)

# కాంగ్రెస్ వెయ్యి రోజుల ప్రజా పీడన

(మొదటిపేజీ తరువాయి)

అని విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు, ఇచ్చిన 420 హామీలను అమలు చేసి రాష్ట్రాన్ని స్వర్గంగా మారుస్తామని చెప్పి.. ప్రజలను నిలువెత్తున ముంచారని ఆరోపించారు. తెలంగాణకు పట్టిన శని నేటితో వెయ్యి రోజులు పూర్తయిందని, అన్ని రంగాల్లో ప్రభుత్వం అట్టర్‌ఫ్లాప్ అయిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలన అబద్ధం, అరాచకం, అజ్ఞానం, అవినీతితో సాగుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో శిఖండి పాలన కొనసాగుతోందని కేటీఆర్ విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు వెయ్యి రోజులు గడిచినా వాటి ఊసే లేదన్నారు. మొదటి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్.. నిరుద్యోగులను నిండా ముంచిందని ఆరోపించారు. సెక్రటేరియట్‌లోనే ఉద్యోగులు రోడ్డెక్కి ముఖ్యమంత్రిని నిలదీసే పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఉద్యోగులకు ఉత్త చేతులు చూపించి, దళితులను దగా చేసి, బహుజనులను మోసం చేసి, మైనారిటీలకు ధోకా మాత్రమే మిగిల్చారని అన్నారు.

**రైతులను మళ్లీ యూరియా కోసం చెప్పల లైన్లలో నిలబెట్టారు**

రైతులకు రూ.50 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి.. చివరకు రూ.20 వేల కోట్లతో సరిపెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు చెప్పిన మాటలకు, అమలు చేసిన దానికి పొంతన లేదన్నారు. రైతుబంధు ఎగవేత, రుణమాఫీలో కోత, రైతుబీమా రద్దు, బోనస్ పేరుతో బోగస్ మాటలతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రైతు కుటుంబానికి రూ.5 లక్షల రైతుబీమా అందించి ధీమా కల్పించామని, ఇప్పుడు ఆ ధీమా, బీమా రెండూ లేకుండా చేశారని అన్నారు. యూరియా కోసం మళ్లీ చెప్పుల లైన్లు వచ్చాయని, కొనుగోలు కేంద్రాల్లో రైతులు నెలల తరబడి పడిగాపులు కాస్తున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. నీళ్లున్నా ఎత్తిపోయడం లేదని విమర్శించారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగితే నానా యాగీ చేసిన ప్రభుత్వం.. తమ పాలనలో చెక్‌డ్యాంలు, ప్రాజెక్టులు దెబ్బతిన్నా పట్టించుకోవడం లేదన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మృతదేహాలను కూడా వెలికితీయలేని పరిస్థితి నెలకొన్నదని, వట్టెం పంప్‌హౌస్ మునిగిందని, సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిందని పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బనకచర్ల పేరుతో తెలంగాణ నీళ్ల దోపిడీకి ప్రయత్నాలు జరుగుతున్నా ప్రభుత్వం కనీసం నిలదీయడం లేదన్నారు. తెలంగాణకు నీటి విషయంలో ఒక్క బొట్టు ద్రోహం జరిగినా బీఆర్ఎస్ వదిలిపెట్టదని హెచ్చరించారు.

**రూ.4 వేల నిరుద్యోగ భృతి ఏమైంది?**

నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు, రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని కేటీఆర్ మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. ఉద్యోగాలు, నోటిఫికేషన్లు అడిగిన యువతపై లాఠీఛార్జీలు చేశారని అన్నారు. అశోక్‌నగర్, చిక్కడపల్లి, దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగులపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. సెప్టెంబర్ 7 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో రెండు లక్షల ఉద్యోగాల హామీపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, తెలంగాణ యువత తరఫున బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు.

**విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదు.. గురుకులాల్లో దుస్థితి**

విద్యార్థుల సమస్యల విషయంలోనూ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా కాలేజీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో రూ.20 వేల కోట్ల బకాయిలను చెల్లించిందని, ప్రస్తుత ప్రభుత్వం రూ.12 వేల కోట్ల బకాయిలను ఇవ్వడం లేదన్నారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించలేని దుస్థితి నెలకొందని, విషాహార ఘటనలతో విద్యార్థుల ప్రాణాలు పోతున్నాయని ఆరోపించారు. 27 వేల పాఠశాలలను నాలుగు వేలకే పరిమితం చేసే కుట్ర జరుగుతోందని అన్నారు. హెచ్‌సీయూ భూముల విషయంలో కోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వ వైఖరి మారడం లేదని విమర్శించారు.

**మహిళలకు ఇచ్చిన హామీలు ఎక్కడ? ఒక్కో ఆడబిడ్డకు రూ.80 వేల బాకీ**

మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని కేటీఆర్ అన్నారు. కోటి 67 లక్షల మంది మహిళలు ఆ డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఒక్కో ఆడబిడ్డకు సుమారు రూ.80 వేల వరకు బాకీ పడ్డారని ఆరోపించారు. కళ్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇస్తామని చెప్పి.. చివరకు ఉన్న లక్ష రూపాయల పథకానికే మంగళం పాడే పరిస్థితి తెచ్చారని విమర్శించారు. కోటి మంది మహిళలను లక్షాధికారులను చేస్తామని చెప్పిన కాంగ్రెస్ హామీ ఏమైందని ప్రశ్నించారు.

**బీసీలకు అన్యాయం.. కామారెడ్డి డిక్లరేషన్ ఏమైంది?**

బీసీల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని కేటీఆర్ ఆరోపించారు. 51 శాతం ఉన్న బీసీలను కేవలం ఐదు శాతం మేరకు పరిమితం చేశారని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో లక్ష కోట్ల హామీ ఇచ్చి.. బీసీ కార్పొరేషన్‌కు కేవలం రూ.74 కోట్లు, ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.99 లక్షలు మాత్రమే ఇచ్చారని అన్నారు. బీసీలు, దళితులు, మైనారిటీలు, మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత.. ఇలా సమాజంలోని ప్రతి వర్గం కాంగ్రెస్ పాలనపై ఆగ్రహంతో ఉందని పేర్కొన్నారు.

**నాలుగున్నర లక్షల కోట్ల అప్పులు.. ఒక్క కొత్త ఇటుక కూడా పెట్టలేదు**

వెయ్యి రోజుల పాలనలో సుమారు రూ.4.5 లక్షల కోట్ల అప్పులు చేశారని కేటీఆర్ ఆరోపించారు. ఒక్క కొత్త ఇటుక పెట్టలేదని, ఒక్క చెరువు కట్టలేదని, ఒక్క చెక్‌డ్యాం నిర్మించలేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలో చేపట్టిన పనులకు రిబ్బన్ కటింగ్‌లు చేయడం తప్ప కొత్తగా చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దిగజారాయని, లాఠీలు, లూటీలు, నేరాలు, ఘోరాలతో పరిస్థితి దారుణంగా మారిందని అన్నారు. ఢిల్లీకి మూటలు పంపడంలో, మంత్రివర్గంలో తన్నుకోవడంలోనే ప్రభుత్వం నిమగ్నమైందని ఎద్దేవా చేశారు.

**ఢిల్లీ ముందు మోకరిల్లిన ప్రభుత్వం.. తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టొద్దు**

వెయ్యి రోజుల పాలనలో చెప్పుకోవడానికి ఏమైనా ఉంటుందేమోనని చూశామని, కానీ ఢిల్లీ ముందు మోకరిల్లిన సిల్లీ పాలనే కనిపిస్తోందని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర స్వతంత్ర నిర్ణయాధికారాన్ని ఢిల్లీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జలద్రోహం జరిగితే బీఆర్ఎస్ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ విడుదల చేసిన ఛార్జ్‌షీట్‌లో రైతులు, యువత, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, బీసీలు, దళితులు, మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల ముందుంచుతున్నామని కేటీఆర్ తెలిపారు. ప్రతి రంగంలో పతనం, ప్రతి వర్గంలో ఆగ్రహం కనిపిస్తోందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని, తెలంగాణ ప్రజల తరఫున బీఆర్ఎస్ పోరాటం మరింత ఉధృతం చేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# పాలంపేట 'గొల్లల గుడి'కి జాతీయ గుర్తింపు!

(మొదటిపేజీ తరువాయి)

జాతీయ ప్రాధాన్య కట్టడంగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటన జారీ చేసింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని భారత పురావస్తు సర్వేక్షణ (ఏఎస్ఐ) ఆగస్టు 31, 2026న ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. గెజిట్ ఆఫ్ ఇండియా ప్రత్యేక సంచికలో ప్రచురితమైన నోటిఫికేషన్ నంబర్ ఎస్.ఓ.4802(ఇ)లో ప్రాచీన కట్టడాలు-పురావస్తు ప్రదేశాలు-అవశేషాల చట్టం-1958లోని సెక్షన్ 4(3) కింద గొల్లల గుడికి ఈ హోదా కల్పించినట్లు పేర్కొన్నారు.

**కాకతీయుల శిల్పకళకు అద్దం**

పాలంపేటలోని కాకతీయ రుద్రేశ్వర (రామప్ప) ఆలయానికి నైరుతి దిశలో గొల్లల గుడి ఉంది. కాకతీయుల కాలం నాటి నిర్మాణ శైలి, సున్నితమైన రాతి చెక్కులు, అద్భుతమైన శిల్పకళ ఈ ఆలయానికి ప్రత్యేకతను తీసుకొచ్చాయి. తూర్పు ముఖంగా ఉండే మండపంతో పాటు మూడు గర్భాలయాలు కలిగిన త్రికూటాలయ నిర్మాణ శైలిలో ఆలయం నిర్మితమైంది. ఆలయ ప్రహరీ, పైకప్పు అంచులు, ద్వారబంధాలపై చెక్కిన శిల్పాలు నాటి శిల్పుల నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. గొల్లల గుడి ద్వారబంధాల వద్ద చెక్కిన హంసల వరుసలు, రాతిలో రూపొందించిన సున్నితమైన రంధ్రాల వల పనితనం ఆకట్టుకుంటాయి. ప్రధాన ఆలయం ముందుభాగంలో ఉన్న ఉప ఆలయాల ద్వారాల వద్ద ద్వారపాలకుల శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.



ఆలయ కుడ్యాలపై విష్ణుమూర్తి, లక్ష్మీదేవి, గణేశుడు, మహిషాసురమర్దిని తదితర దేవతా మూర్తులతో పాటు జంతువులు, పుష్పాలంకరణలకు సంబంధించిన శిల్పాలు కనిపిస్తాయి. ఎత్తయిన వేదికపై నిర్మించిన ఈ కట్టడం కాకతీయుల శిల్పకళా వైభవాన్ని ప్రతిబింబిస్తోంది.

**పాలంపేటకు మరింత ప్రాధాన్యం**

ఇప్పటికే యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయంతో అంతర్జాతీయ పర్యాటక పటంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన పాలంపేటకు గొల్లల గుడికి లభించిన జాతీయ హోదా మరింత ప్రాధాన్యం తీసుకురానుంది. ఒకే ప్రాంతంలో కాకతీయుల కాలానికి చెందిన విలువైన కట్టడాలు ఉండటంతో పాలంపేట చారిత్రక, సాంస్కృతిక వారసత్వ ప్రాంతంగా మరింత గుర్తింపు పొందే అవకాశం ఉంది. జాతీయ ప్రాధాన్య కట్టడంగా గుర్తింపు లభించడంతో ఆలయ పరిరక్షణ, సంరక్షణ, శాస్త్రీయ నిర్వహణకు మరింత ప్రాధాన్యం లభించే అవకాశం ఉందని చరిత్ర, పురావస్తు ప్రియులు అభిప్రాయపడుతున్నారు. దీంతో దేశవ్యాప్తంగా గొల్లల గుడిపై ఆసక్తి పెరిగే అవకాశం ఉంది.

# వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

గొప్ప వ్యక్తి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.1,300 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేసి, రైతులపై ఉన్న కేసులను ఎత్తివేశారని తెలిపారు. దీంతో రైతుల గుండెల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.

**సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం**

తెలంగాణలో సాగునీటిని అందించేందుకు ప్రాణహిత-చేవెళ్ల, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వంటి ప్రాజెక్టులను ప్రారంభించిన ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదేనని సీఎం అన్నారు. వైఎస్ ప్రారంభించిన ప్రాణహిత-చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులు ప్రస్తుతం ఆగిపోయాయని పేర్కొన్నారు. వాటిని పూర్తి చేసి తెలంగాణ సమాజానికి అంకితం చేస్తామని స్పష్టం చేశారు. వైఎస్ అభిమానులకు ఒక విషయాన్ని గుర్తుచేస్తున్నానని రేవంత్‌రెడ్డి అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చివరి కోరిక ఇంకా నెరవేరలేదని పేర్కొన్నారు. రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన జీవిత లక్ష్యమని వైఎస్ చెప్పారని గుర్తుచేశారు. అయితే ఆ కోరిక తీరకుండానే ఆయన మరణించారని అన్నారు. దేశ ప్రజలు ప్రస్తుతం కష్టాల్లో ఉన్నారని, ఇలాంటి సమయంలో నాయకుడు ప్రజలకు అండగా నిలవాల్సిన చారిత్రక సందర్భం దేశానికి అవసరమని రేవంత్‌రెడ్డి అన్నారు. దేశానికి బలమైన నాయకుడు రాహుల్‌గాంధీ అని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేందుకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని కోరారు. మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో అందరూ కలిసి కష్టపడి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు.




**కాంగ్రెస్ పాలనతో ఆహార భద్రత**

దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్య, సాగునీటి రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన ముందుచూపుతో దేశం ఆకలి కేకల నుంచి ఆహార ఎగుమతుల స్థాయికి చేరుకుందని పేర్కొన్నారు. రైతులు పండించే పంటలకు మద్దతు ధర అందించే చర్యలను దేశంలో తొలిసారిగా చేపట్టిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుందని అన్నారు. అసైన్డ్ భూములను పేదలకు పంచిన చరిత్ర కూడా ఇందిరాగాంధీదేనని తెలిపారు. దేశంలోని ప్రతి ఒక్కరికీ ఆహార భద్రత కల్పించేందుకు సోనియాగాంధీ ఆహార భద్రత చట్టాన్ని తీసుకొచ్చారని సీఎం అన్నారు. పీడీఎస్ విధానాన్ని తీసుకొచ్చి రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు అందించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో 3 కోట్ల 48 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామంటే అందుకు గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన వ్యవస్థలే కారణమని రేవంత్‌రెడ్డి అన్నారు.

# సీఎంపైనే ముందుగా చర్యలు తీసుకోవాలి!

(మొదటిపేజీ తరువాయి)

నుంచి తొలగించాలనే అంశంపై కూడా కొండా సురేఖ స్పష్టత ఇచ్చారు. ''నా రాజీనామా కోరుతూ ఎవరూ నన్ను సంప్రదించలేదు'' అని తెలిపారు. తాను మంత్రిగా మంచి పనితీరు కనబరుస్తున్నానని, అవినీతి ఆరోపణలు లేకుండా పనిచేస్తున్నానని చెప్పారు. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఉన్నానని, తనను పదవిలో కొనసాగించాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరినట్లు వెల్లడించారు. పార్టీ పెద్దలకు తాను చెప్పాల్సిన విషయాలన్నీ చెప్పానని, ఇప్పుడు వారు తీసుకునే నిర్ణయం కోసం వేచి చూస్తున్నానని అన్నారు. తన కుమార్తె సుస్మితకు వివాహం జరిగిందని, ఆమె స్వతంత్రంగా తన జీవితాన్ని కొనసాగిస్తున్నారని చెప్పారు. ఆమె తన ఇష్టానుసారం మాట్లాడే హక్కు కలిగిన స్వతంత్ర మహిళ అని, ఆమె మాట్లాడవద్దని తాను చెప్పలేనని స్పష్టం చేశారు.

**'కుమార్తె వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయొద్దు'**

తన కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని కొండా సురేఖ స్పష్టం చేశారు. ''నా కుమార్తె వ్యాఖ్యలను నేను ఖండించను.. సమర్థించను. ఆమె వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయడం సరికాదు'' అని చెప్పారు. రోజూ ఎంతో మంది మాట్లాడుతారని, అందులో సుస్మిత కూడా ఒకరని పేర్కొన్నారు. తన కుమార్తె పెళ్లి చేసుకుని అత్తింటి కోడలిగా తన జీవితాన్ని కొనసాగిస్తోందని, ఆమె వ్యవహారాలకు తాను బాధ్యత వహించలేనని చెప్పారు. సుస్మిత వ్యాఖ్యలపై తనను వివరణ కోరడం సరికాదని పార్టీ పెద్దలకు వివరించారు. మహిళలు స్వతంత్రంగా జీవించాలని రాహుల్‌గాంధీ చెబుతుంటారని, తన కుమార్తె కూడా స్వతంత్రంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసే హక్కు కలిగి ఉందని అన్నారు. ఆమె వ్యాఖ్యలను సమర్థించడం, ఖండించడం రెండింటికీ తాను దూరంగా ఉంటానని స్పష్టం చేశారు.

**'బీసీలకు ఒక న్యాయం.. ఇతరులకు మరో న్యాయమా?'**

కాంగ్రెస్‌లో సామాజిక న్యాయం అమలుపైనా కొండా సురేఖ ప్రశ్నలు లేవనెత్తారు. ''బీసీలకు ఒక న్యాయం.. ఇతర సామాజికవర్గాలకు మరో న్యాయమా?'' అని ప్రశ్నించారు. తన విషయంలో ఒక విధంగా, ఇతర సామాజికవర్గాలకు చెందిన నేతల విషయంలో మరో విధంగా వ్యవహరించడం సరికాదని చెప్పారు. పార్టీ క్రమశిక్షణ అందరికీ సమానంగా వర్తించాల్సిందేనని పేర్కొన్నారు. ఒకరిపై చర్యలు తీసుకునే ముందు అదే తరహా వ్యాఖ్యలు, ఆరోపణలు చేసిన ఇతర నేతల వ్యవహారాలను కూడా పరిశీలించాలని కోరారు. పార్టీ వ్యవస్థలో న్యాయం, సమానత్వం ఉండాలని స్పష్టం చేశారు. తన విషయంలో మాత్రమే క్రమశిక్షణను ప్రస్తావించడం సరైన విధానం కాదని, ఇతర నాయకుల వ్యవహారాలను కూడా అధిష్ఠానం పరిశీలించాలని ఆమె కోరారు.

**'నాపై ఆరోపణలు చేయించిన వారెవరో తెలుసు'**

పార్టీలో కొంతమంది తనపై ఆరోపణలు చేయించారని కొండా సురేఖ ఆరోపించారు. ''నాపై ఎవరు ఆరోపణలు చేయించారో నాకు తెలుసు. పేర్లు చెబితే మరో వివాదం అవుతుంది'' అని చెప్పారు. తనపై ఆరోపణలు చేసిన వారికి కూడా షోకాజ్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ ఆ దిశగా కూడా ఆలోచించాలని కోరారు. తనకు షోకాజ్ నోటీసు ఇవ్వడమే అసలు తప్పు అని స్పష్టం చేశారు. తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరణను క్రమశిక్షణ కమిటీకి ఇచ్చానని చెప్పారు. మీనాక్షి నటరాజన్‌కు కూడా తన వివరణను చెప్పానని, ఆమె అధిష్ఠానానికి వివరిస్తానని చెప్పినట్లు తెలిపారు. పార్టీ తీసుకునే నిర్ణయం ఆధారంగానే తాను తదుపరి నిర్ణయం తీసుకుంటానని చెప్పారు.

**అధిష్ఠానానికి రాతపూర్వకంగా పూర్తి వివరణ**

తన వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానానికి పూర్తి వివరాలు రాతపూర్వకంగా అందజేసినట్లు కొండా సురేఖ తెలిపారు. ''రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, కేసీ వేణుగోపాల్‌కు రాతపూర్వకంగా వివరణ ఇచ్చాను. నేను చెప్పాల్సినవన్నీ పార్టీ పెద్దలకు చెప్పాను'' అని వెల్లడించారు. తన వివరణను కేసీ వేణుగోపాల్‌కు వాట్సప్ ద్వారా కూడా పంపినట్లు చెప్పారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి తన వాదనను వివరించానన్నారు. పార్టీ పెద్దలు ఆలోచిస్తామని చెప్పారని, ఇక నిర్ణయం వారి చేతుల్లోనే ఉందని తెలిపారు. తన వ్యవహారంపై పార్టీ ఏ నిర్ణయం తీసుకుంటుందో తనకు తెలియదని, అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవిస్తానని చెప్పారు.

**టీపీసీసీ నివేదికతో మొదలైన వివాదం**

గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు వివాదానికి కారణమయ్యాయి. సుస్మిత వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇచ్చింది. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి ఆమె తన వివరణ అందించారు. అనంతరం కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి సంబంధించిన అంశాలపై రూపొందించిన నివేదికను టీపీసీసీ అధిష్ఠానానికి పంపింది. పార్టీ గీత దాటి వ్యవహరించిన నేతలపై చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణ కమిటీ సూచించింది. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలని ఏఐసీసీకి సిఫార్సు చేసినట్లు కూడా పార్టీ వర్గాల్లో చర్చ జరిగింది. ఈ నేపథ్యంలోనే ఆమె ఢిల్లీ వెళ్లి ఖర్గేను కలిశారు.

**చర్యలపై ఉత్కంఠ.. అధిష్ఠానం నిర్ణయమే కీలకం**

కొండా సురేఖ తాజా వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. ఒకవైపు ఆమెపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ ఉండగా.. మరోవైపు తనపై చర్యలు తీసుకునే ముందు సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను కూడా పరిశీలించాలని సురేఖ కోరడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. తన కుమార్తె వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయొద్దని ఆమె స్పష్టం చేయడంతో పాటు, తనపై ఆరోపణలు చేసిన వారిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీల విషయంలో, ఇతర సామాజికవర్గాల విషయంలో పార్టీ వ్యవహరిస్తున్న తీరుపైనా ప్రశ్నలు లేవనెత్తారు. తాను మంత్రిగా కొనసాగాలని కోరుకున్నానని, ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నానని చెబుతూ.. పార్టీ అధిష్ఠానం నిర్ణయం కోసం వేచి చూస్తున్నానని సురేఖ స్పష్టం చేశారు.

# ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ఘోర వైఫల్యం




- కేసీఆర్ కట్టిన ఇల్లు.. పెట్టిన పొయ్యిలా రాష్ట్రాన్ని ఇస్తే కుప్పకూల్చారు
- విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయ రంగాలు పూర్తిగా నిర్వీర్యం
- ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది
- : మాజీ మంత్రి హరీశ్‌రావు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** కేసీఆర్ కట్టిన ఇల్లు.. పెట్టిన పొయ్యిలా తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పగిస్తే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవస్థలన్నింటినీ కుప్పకూల్చిందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై 'ఛార్జ్‌షీట్' విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పేరుతో బాండ్ పేపర్లు రాసిచ్చి, వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని ప్రజలను నమ్మించిన కాంగ్రెస్.. వెయ్యి రోజులు గడిచినా వాటిని అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ తన అపార అనుభవంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని హరీశ్‌రావు అన్నారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో అనేక కార్యక్రమాలు చేపట్టి దేశం నేర్చుకునే విధంగా తెలంగాణను అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. తాగునీరు, సాగునీరు సహా ప్రతి రంగంలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని చెప్పారు. వ్యవసాయ రంగంలో అత్యధిక వరి ధాన్యం పండించే రాష్ట్రంగా తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దారని అన్నారు. అయితే రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వ్యవస్థలన్నీ ఒక్కొక్కటిగా కుప్పకూలుతున్నాయని ఆరోపించారు.

**విద్య, వైద్యం, విద్యుత్.. అన్ని రంగాల్లో తిరోగమనం**

కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థ, వైద్య వ్యవస్థ, విద్యుత్, తాగునీరు, శాంతిభద్రతలు సహా ప్రతి వ్యవస్థ నిర్వీర్యమైందని హరీశ్‌రావు విమర్శించారు. కేసీఆర్ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందితే.. ఇప్పుడు కరెంట్ కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దేశంలోనే అగ్రగామిగా నిలిచిన తెలంగాణ వైద్య రంగం నేడు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీసం మందులు కూడా దొరకని స్థితికి దిగజారిందని ఆరోపించారు. పురోగమనం వైపు వేగంగా సాగాల్సిన తెలంగాణ.. కాంగ్రెస్ ప్రభుత్వ చేతకానితనంతో తిరోగమనం వైపు వెళ్తోందన్నారు. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం చేస్తున్న తప్పిదాల కారణంగా అన్ని శాఖల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు అన్నారు. వ్యవస్థలను కాపాడాలని, ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, ప్రజల కష్టాలను తొలగించాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకే బీఆర్ఎస్ ఏడు రోజుల నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిందని తెలిపారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని కొనసాగిస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు.

# గ్లోబల్ సమ్మిట్–రక్ష ఎక్స్‌పోలో భాగస్వాములు కండి

- రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానం
- దేవరకద్ర డీఆర్‌డీఎల్ ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమి
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి మరో 750 ఎకరాలు ఇచ్చేందుకు అంగీకారం
- కేంద్ర రక్షణ శాఖ సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావడంతో పాటు రక్ష ఎక్స్‌పో-2026ను ప్రారంభించాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. బుధవారం ఢిల్లీలో రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం భేటీ అయి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమ్మిట్‌లో భాగంగా నిర్వహించే రక్ష ఎక్స్‌పోలో ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు సంబంధించిన సదస్సుతో పాటు ఎయిర్‌షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సీఎం వివరించారు. దేశవ్యాప్తంగా రక్షణ రంగ పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే ఈ కార్యక్రమానికి రక్షణ శాఖ సహకారం అందించాలని కోరారు. ఎయిర్‌షోకు అవసరమైన గగనతల అనుమతులు ఇవ్వడంతో పాటు భారత వైమానిక దళ విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు పాల్గొనేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ వంటి రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, డీఆర్‌డీవో ప్రయోగశాలలు ఎక్స్‌పోలో పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించేలా చూడాలని కోరారు. విదేశీ రక్షణ ప్రతినిధులు, ద్వైపాక్షిక బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రతినిధులతో సమావేశాలకు కూడా కేంద్ర రక్షణ శాఖ సహకరించాలని తెలిపారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 750 ఎకరాల భూ సేకరణ చేపట్టిందని రేవంత్‌రెడ్డి తెలిపారు. రక్షణ శాఖ కోరిన మొత్తం 1,500 ఎకరాలకు అనుగుణంగా మరో 750 ఎకరాలు సేకరించి ఇచ్చేందుకు అంగీకరించారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో డీఆర్‌డీఎల్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు టీజీఐఐసీ అంగీకరించినట్లు తెలిపారు. మొత్తం భూమికి ఏడాదికి రూ.1 నామమాత్రపు లీజుతో 33 ఏళ్లకు కేటాయించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో రాష్ట్ర శక్తి శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం. అనిల్‌కుమార్ యాదవ్, డా. మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాంనాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ పాల్గొన్నారు.



# రవాణా శాఖలో 'పెద్ద సారు' పెత్తనం!

- అధికారి విధులకు దూరంగా ఉన్నా.. ఆయన లాగిన్‌తో ధ్రువపత్రాల జారీ?
- అధికారిక లాగిన్‌ను ఇతరులు వినియోగించారా?
- నిబంధనలకు విరుద్ధంగా అధికారాల బదలాయింపు జరిగిందా?
- అధికార దుర్వినియోగంపై ఉన్నతాధికారులు విచారణ చేయాల్సిందే!






**కాకతీయ, ములుగు ప్రతినిధి :** ములుగు జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో అధికార దుర్వినియోగం జరిగిందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా రవాణా అధికారి (డీటీఓ) కార్యాలయంలో అందుబాటులో లేని సమయంలోనూ ఆయన పేరుతో ధ్రువపత్రాలు జారీ అయినట్లు తెలుస్తుండటం ఈ సందేహాలకు కారణమవుతోంది. సెప్టెంబరు 2న డీటీఓ ఇతర శాఖాపరమైన పనుల నిమిత్తం కోర్టుకు హాజరైనట్లు సమాచారం. అదే సమయంలో కార్యాలయంలో ఆయన పేరుతో అధికారిక ప్రక్రియలు కొనసాగినట్లు తెలుస్తోంది. డీటీఓకు కేటాయించిన లాగిన్ వివరాలను ప్రైవేటు ఉద్యోగి వినియోగించారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. నిజంగా అదే జరిగితే.. అధికారికంగా తనకు కేటాయించిన అధికారాలను మరో వ్యక్తి ద్వారా వినియోగించేందుకు అధికారి అనుమతించారా? లేక ఎలాంటి అధికారిక ఆదేశాలు లేకుండానే లాగిన్ వినియోగించారా? అనే అంశాలు ఇప్పుడు కీలకంగా మారాయి. డీటీఓ విధులకు హాజరు కాకుండా కోర్టుకు వెళ్లిన రోజే ఆయన పేరుతో ధ్రువపత్రాలు జారీ కావడం సాధారణ పరిపాలనా ప్రక్రియ కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారి గైర్హాజరైనప్పుడు ఆయన స్థానంలో విధులు నిర్వహించేందుకు అధికారికంగా మరో అధికారిని నియమించారా? లేక డీటీఓకు ఉన్న అధికారాలను కార్యాలయంలోని ఇతరులు వినియోగించారా? అన్నది తేలాల్సి ఉంది. ముఖ్యంగా అధికారి వ్యక్తిగత లాగిన్ ద్వారా జరిగే వ్యవహారాలను మరొకరు నిర్వహించి ఉంటే.. అది కేవలం కార్యాలయ విధానాల ఉల్లంఘనకే పరిమితమవుతుందా? లేక అధికార దుర్వినియోగం కిందకు వస్తుందా? అన్నది ఉన్నతాధికారుల విచారణలో తేలాల్సి ఉంటుంది.

**ప్రైవేటు వ్యక్తికి అధికారిక లాగిన్ ఎలా?**

రవాణా శాఖలో డీటీఓ లాగిన్ సాధారణ ఉద్యోగి ఉపయోగించే యూజర్ ఐడీ కాదని, దాని ద్వారా కీలకమైన అధికారిక ప్రక్రియలు జరుగుతాయని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అలాంటి లాగిన్ వివరాలు ప్రైవేటు ఉద్యోగికి చేరాయన్న ఆరోపణలు నిజమైతే.. అధికారిక వ్యవస్థలోకి అనధికార వ్యక్తి ప్రవేశించినట్టేనన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారి తన లాగిన్ వివరాలను ఇతరులకు అందించి ఉంటే దాని వెనుక ఉద్దేశం ఏమిటి? ఎవరి ఆదేశాలతో ఆ వ్యక్తి అధికారిక కార్యకలాపాలు నిర్వహించారు? ఎలాంటి పర్యవేక్షణ లేకుండా ధ్రువపత్రాలు జారీ చేసే అవకాశం కల్పించారా? అనే అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. లాగిన్ ద్వారా జరిగిన ప్రతి లావాదేవీకి సంబంధించిన డిజిటల్ వివరాలను పరిశీలిస్తే ఎవరు, ఎప్పుడు, ఏ ప్రక్రియ నిర్వహించారన్నది స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**ఇన్‌చార్జి లేకుండా అధికారాల వినియోగమా?**

ఒక జిల్లా స్థాయి అధికారి విధులకు అందుబాటులో లేని సమయంలో ఆయన బాధ్యతలను మరో అర్హత కలిగిన అధికారికి అధికారికంగా అప్పగించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ధ్రువపత్రాల జారీ వంటి అధికారిక నిర్ణయాలు వ్యక్తిగత లాగిన్‌ల ఆధారంగా కాకుండా నిబంధనల ప్రకారం కొనసాగాల్సి ఉంటుంది. సెప్టెంబరు 2న డీటీఓ గైర్హాజరైన సమయంలో ఇలాంటి అధికారిక బాధ్యతల బదలాయింపు జరిగిందా? జరిగితే ఎవరికీ అప్పగించారు? అందుకు సంబంధించిన ఉత్తర్వులు ఉన్నాయా? అన్న వివరాలు బయటకు రావాల్సి ఉంది. ఎలాంటి ఇన్‌చార్జి ఉత్తర్వులు లేకుండానే డీటీఓ లాగిన్‌ను మరొకరు ఉపయోగించి ఉంటే.. ఆ వ్యవహారంపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అంశాన్ని కూడా అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది.

**'షాడో' అధికారి వ్యవహారంపై విచారణ**

ములుగు రవాణా శాఖ కార్యాలయంలో కొందరు ప్రైవేటు వ్యక్తుల జోక్యం పెరిగిందన్న ఆరోపణలు గతంలోనూ వినిపించిన నేపథ్యంలో తాజా పరిణామాలు మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రభుత్వ అధికారాలు కలిగిన ప్రక్రియల్లో ప్రైవేటు వ్యక్తులు జోక్యం చేసుకునే పరిస్థితి ఉంటే.. అది పరిపాలనా వ్యవస్థకు తీవ్ర విఘాతం కలిగించే అంశంగా మారుతుంది. అధికారి కార్యాలయంలో లేని సమయంలో ఆయన పేరుతో ధ్రువపత్రాలు జారీ కావడం, అదే సమయంలో లాగిన్ వివరాలు ప్రైవేటు వ్యక్తికి చేరాయన్న ఆరోపణలు రావడం వెనుక అసలు వ్యవహారం ఏమిటో తేల్చాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది. డీటీఓ లాగిన్ వివరాలను ఎవరు వినియోగించారు? ఏ సమయంలో ఎన్ని ధ్రువపత్రాలు జారీ చేశారు? ఆ ప్రక్రియలను ఎవరు ఆమోదించారు? అధికారి గైర్హాజరైన సమయంలో అధికారికంగా ఇన్‌చార్జి ఎవరైనా ఉన్నారా? లాగిన్ వివరాలను ప్రైవేటు వ్యక్తికి అందించినట్లయితే అందుకు అధికారి అనుమతి ఉందా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని జిల్లా వాసులు కోరుతున్నారు. ముఖ్యంగా డిజిటల్ లాగిన్ చరిత్ర, ధ్రువపత్రాల జారీ వివరాలు, కార్యాలయ హాజరు రికార్డులు, ఇన్‌చార్జి బాధ్యతలకు సంబంధించిన ఉత్తర్వులను పరిశీలించాలని వారు కోరుతున్నారు. అధికారిక అధికారాలను అనధికార వ్యక్తుల ద్వారా వినియోగించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఆరు గ్యారంటీల అమలేది..?

- వంద రోజుల్లో అన్నారు.. వెయ్యి రోజులైనా నెరవేర్చలేదు
- తెలంగాణను చంద్రబాబుకు తాకట్టు
- కాళేశ్వరం నుంచి నీటిని విడుదల చేయకుండా రైతులను ఇబ్బంది
- రుణమాఫీ, రైతుబంధు అమలులోనూ మోసమే
- భూభారతి పేరుతో రైతుల భూములపై ఆంక్షలు
- కాంగ్రెస్‌ను గద్దె దించే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధ్వజం

**కాకతీయ, జనగామ:** తెలంగాణ సాధించుకున్నది రాష్ట్ర ప్రజలు, రైతులు బాగుపడటం కోసమేనని, కానీ సీఎం రేవంత్‌రెడ్డి తన గురువు చంద్రబాబునాయుడికి తెలంగాణను తాకట్టు పెడుతున్నారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణకు దక్కాల్సిన నీటిని ఆంధ్రప్రదేశ్‌కు దారాదత్తం చేస్తూ రాష్ట్ర రైతులను ఆగం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయకుండా అక్కడికి వెళ్లి లేనిపోని మాటలు చెబుతూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ చేపడుతున్న పోరాటంలో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను వంద రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పిందని పల్లా రాజేశ్వర్‌రెడ్డి గుర్తుచేశారు. అయితే వెయ్యి రోజులు పూర్తయినా హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి మరో రెండేళ్లు అధికారంలో కొనసాగే అర్హత లేదని అన్నారు. తెలంగాణ ప్రజలను మోసం చేయాలనే ఉద్దేశంతోనే హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా అదే విధానాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు.

**రైతులు, నిరుద్యోగులను మోసం చేశారు**

రుణమాఫీ, రైతుబంధు రెండు పథకాలను ఎగ్గొట్టి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని పల్లా ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందించామని, ప్రస్తుత ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు యువత సిద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో కేంద్రంతో దోస్తీ చేస్తూ, తెలంగాణకు వచ్చినప్పుడు బీజేపీని విమర్శిస్తున్నారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రులు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని ముఖ్యమంత్రి చెప్పడం సిగ్గుచేటని అన్నారు. తెలంగాణలో కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టిన దుర్మార్గపు ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఆరోపించారు. భూభారతి పేరుతో 22 రకాల నిషేధిత జాబితాలను ఏర్పాటు చేసి ఎమ్మార్వోలు, ఆర్డీవోలు రైతుల నుంచి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. ఈ ప్రక్రియను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ముందు పెట్టి నిర్వహిస్తూ రైతుల నుంచి భూములను లాక్కుంటున్నారని విమర్శించారు.

**గద్దె దించే వరకు పోరాటం**

తెలంగాణ నీళ్లు, రైతుల హక్కులు, ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు, ప్రజా సమస్యలను పరిష్కరించే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీని గద్దె దించే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తేల్చిచెప్పారు.

## ఉద్యమంలో పెద్ది పోరాటం
# చిరస్మరణీయం



- ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన ఉద్యమకారుడు
- భావితరాలకు ఆయన పోరాటం స్ఫూర్తిదాయకం
- తెలంగాణ ఉద్యమానికి ఊపునిచ్చిన ధర్నాలు, నిరసనలు
- గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

**కాకతీయ, హనుమకొండ :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి పోషించిన పాత్ర చిరస్మరణీయమని గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. ఉద్యమ సమయంలో ఆయన నిర్వహించిన ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు, ఆందోళనలు, సభలు, సమావేశాలు తెలంగాణ ఉద్యమానికి మరింత ఊపునిచ్చాయని పేర్కొన్నారు. హనుమకొండలోని కాలేజీ కళాక్షేత్రంలో తెలంగాణ పూర్వ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్ది సుదర్శన్‌రెడ్డి సంస్మరణ సభలో నన్నపునేని నరేందర్ పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం పెద్ది సుదర్శన్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక ఉద్యమ కార్యక్రమాల్లో ముందుండి పోరాడారని నన్నపునేని నరేందర్ గుర్తుచేశారు. ఉద్యమకారులను సమీకరించి ప్రజల్లో తెలంగాణ రాష్ట్ర సాధన పట్ల చైతన్యం తీసుకొచ్చారని తెలిపారు. ఉద్యమ సమయంలో ఎదురైన ఎన్నో ఇబ్బందులు, ఒత్తిళ్లను లెక్కచేయకుండా తెలంగాణ కోసం ఆయన నిరంతరం పోరాడారని అన్నారు.

**త్యాగాలు భావితరాలకు స్ఫూర్తి**

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి చేసిన త్యాగాలు, పోరాటాలు, ప్రజా ఉద్యమానికి అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని నన్నపునేని నరేందర్ అన్నారు. ఆయన పోరాటం, ఉద్యమ స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల కోసం పనిచేయడం, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నన్నపునేని నరేందర్ అన్నారు. దివంగత నేత ఆశయాలు నెరవేరాలని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

# రికార్డుల్లో ఒకలా.. మోకాపై మరోలా!

- వ్యవసాయ భూమిగా పట్టా.. మోకాపై వ్యవసాయేతర వినియోగం
- లేఅవుట్ చేసి 50–60 మందికి ప్లాట్ల విక్రయం?
- కోర్టు వివాదం నడుస్తుండగానే మట్టి డంపింగ్.. రైతుబంధుపైనా సందేహాలు
- అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు.. సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్



**కాకతీయ, గీసుగొండ :** రికార్డుల్లో వ్యవసాయ భూమిగా నమోదై ఉన్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు గీసుగొండ మండలం గొర్రెకుంట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 160పై చర్చకు దారితీశాయి. ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న 2.10 ఎకరాల భూమిలో గతంలో లేఅవుట్ చేసి సుమారు 50 నుంచి 60 మందికి ప్లాట్లు విక్రయించినట్లు సమాచారం. అనంతరం ప్లాట్ల కొనుగోలుదారులు, విక్రయదారుల మధ్య వివాదం తలెత్తి కోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం న్యాయస్థానంలో వివాదం కొనసాగుతుండగానే అక్కడ మట్టి డంపింగ్, తరలింపు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు రెవెన్యూ రికార్డుల్లో మాత్రం భూమి వ్యవసాయంగానే నమోదై ఉండటంతో రైతుబంధు సాయం అందుతున్నట్లు సమాచారం. దీంతో భూమి రికార్డులు, వాస్తవ వినియోగం మధ్య వ్యత్యాసంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**లేఅవుట్‌తో మొదలైన వివాదం**

సర్వే నంబర్ 160లోని 2.10 ఎకరాల్లో గతంలో లేఅవుట్ వేసి ప్లాట్లు విక్రయించినట్లు తెలుస్తోంది. ఇందులో 50 నుంచి 60 మంది వరకు ప్లాట్లు కొనుగోలు చేసినట్లు సమాచారం. అయితే అనంతరం భూమి విక్రయదారులు, అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి మధ్య వివాదం ఏర్పడినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. దీంతో ప్లాట్ల కొనుగోలుదారుల హక్కులు, భూమిపై యాజమాన్య అంశాలు న్యాయస్థానం పరిధికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ కేసు తేలకముందే భూమిలో కొత్తగా కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఇప్పుడు ఆసక్తిని రేపుతున్నాయి. ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల్లో సదరు 2.10 ఎకరాల భూమి వ్యవసాయ భూమిగానే కొనసాగుతున్నట్లు సమాచారం. ఇదే ఆధారంగా రైతుబంధు సాయం కూడా అందుతున్నట్లు తెలుస్తోంది. అయితే గతంలో లేఅవుట్ చేసి ప్లాట్లు విక్రయించినట్లు, ప్రస్తుతం మట్టి డంపింగ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉండటంతో భూమి వాస్తవ వినియోగంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భూమి స్వభావంలో మార్పులు చోటుచేసుకున్నాయా? రైతుబంధు సాయం పొందేందుకు నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**కోర్టు కేసు ఉండగానే మట్టి డంపింగ్?**

న్యాయస్థానంలో వివాదం కొనసాగుతున్న భూమిలో మట్టి డంపింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పనులకు సంబంధించి సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎంత పరిమాణంలో మట్టి తరలించేందుకు అనుమతి ఇచ్చారు? అనే వివరాలు వెల్లడికావాల్సి ఉంది. భూమి హక్కులపై వివాదం పరిష్కారం కాకముందే అక్కడ మట్టి తరలింపు వంటి కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని స్థానికులు కోరుతున్నారు. భూమి రికార్డులు, గతంలో జరిగిన లేఅవుట్, ప్లాట్ల విక్రయాలు, కోర్టు వివాదం, రైతుబంధు సాయం, మట్టి తరలింపు వంటి అంశాలపై అధికారులకు సమాచారం ఉందా? ఉంటే ఇప్పటివరకు క్షేత్రస్థాయి పరిశీలన ఎందుకు జరగలేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. రాజకీయ పలుకుబడి కారణంగా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు కూడా స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. అయితే వీటిపై అధికారిక నిర్ధారణ లేదు. సంబంధిత శాఖలు రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెల్లడిస్తేనే ఆరోపణల్లో నిజానిజాలు తేలనున్నాయి.

**రికార్డులు.. అనుమతులపై సమగ్ర పరిశీలన అవసరం**

సర్వే నంబర్ 160లోని భూమికి సంబంధించిన పాత, ప్రస్తుత రెవెన్యూ రికార్డులతో పాటు లేఅవుట్ అనుమతులు, ప్లాట్ల విక్రయ వివరాలు, కోర్టు కేసు, రైతుబంధు మంజూరు, మట్టి డంపింగ్–తరలింపునకు సంబంధించిన అనుమతులను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. రికార్డుల్లో వ్యవసాయ భూమిగా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో వేరే విధంగా వినియోగిస్తుంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా న్యాయస్థానంలో వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో భూమిపై జరుగుతున్న కార్యకలాపాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

## 1000 రోజుల పాలన..
# హామీల అమలు ఏదీ?

- కాంగ్రెస్ వైఫల్యాలపై పరకాలలో బీఆర్ఎస్ నిరసన
- 420 అడుగుల ఫ్లెక్సీతో భారీ ర్యాలీ.. బస్టాండ్ వద్ద ధర్నా
- హామీలు అమలు చేయకుంటే మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

**కాకతీయ, పరకాల :** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం పరకాలలో భారీ నిరసన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు 420 అడుగుల ఫ్లెక్సీతో నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీ ప్రారంభించగా.. అనంతరం బస్టాండ్ కూడలి వద్ద ధర్నా చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, రైతుభరోసా, రెండు లక్షల ఉద్యోగాల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని దేవుళ్లపై ప్రమాణాలు చేసి, బాండ్ పేపర్లపై సంతకాలు చేసినప్పటికీ 1000 రోజులు గడిచినా అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, పేదలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని ధర్మారెడ్డి తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే నియోజకవర్గవ్యాప్తంగా మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని, తగిన సమయంలో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# తుపాకీ రాముడిలా రేవంత్ మాటలు

- 420 హామీల అమలుకు మెడలు వంచైనా పోరాడుతాం
- ప్రజల కోసం ఉద్యమాలు, పోరాటాలు మాకు కొత్త కాదు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ కన్నెర్ర
- పాలకుర్తి నియోజకవర్గంలో భారీ నిరసన ప్రదర్శనలు



**కాకతీయ, పాలకుర్తి :** సీఎం రేవంత్‌రెడ్డి మాటలు, తుపాకీ రాముడి మాటలు ఒక్కటేనని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత పాలన సాగిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి, వెయ్యి రోజులు పూర్తవుతున్నా వాటిని నెరవేర్చే ఆలోచన చేయడం లేదని విమర్శించారు. హామీలను గుర్తుచేసేందుకే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను ప్రజలకు గుర్తుచేసేందుకే 420 ఫీట్ల ఫ్లెక్సీ ప్రదర్శిస్తున్నామని ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ప్రతి గ్రామంలో బాకీ కార్డులు పంపిణీ చేసి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఎంత బాకీ పడిందో వివరిస్తున్నామని అన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి 33 నెలలకు రూ.82,500 బాకీ పడ్డారని ఆరోపించారు. వృద్ధులు, బీడీ కార్మికులకు నెలకు రూ.4 వేలు ఇస్తామని చెప్పి రూ.66 వేల చొప్పున బాకీ పడ్డారని, దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు పింఛన్ ఇస్తామని చెప్పి హామీని విస్మరించారని విమర్శించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ పథకాన్నే తొలగించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు.

**రైతులు, నిరుద్యోగులను నిలువునా మోసం చేశారు**

ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద కాలేజీలకు రూ.12 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. వరంగల్ రైతు డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. రైతు భరోసా కింద నాలుగు ఎకరాల రైతుకు రూ.1.02 లక్షలు బాకీ పడ్డారని అన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ, పండిన ప్రతి పంటకు రూ.500 బోనస్ ఇస్తామన్న హామీలను అమలు చేయలేదని విమర్శించారు. రైతు బీమా ప్రీమియం చెల్లించకుండా పథకాన్ని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల సాయం చేస్తామని చెప్పి రెండేళ్లకు రూ.24 వేలు బాకీ పడ్డారని అన్నారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి.. తాము ఇచ్చిన నోటిఫికేషన్లకే ఉద్యోగ నియామక పత్రాలు అందించి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. నిరుద్యోగ భృతి కింద 33 నెలలకు రూ.1.32 లక్షలు బాకీ పడ్డారని ఆరోపించారు.

**తెలంగాణను మళ్లీ వెనక్కి తీసుకెళ్లారు**

బంగారు తెలంగాణ దిశగా సాగుతున్న రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఇందిరమ్మ రాజ్యం పేరుతో పాత పరిస్థితుల్లోకి తీసుకెళ్లిందని ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. రాష్ట్రంలో కరెంట్ కష్టాలు, యూరియా కొరత, నీటి సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపించారు. వెయ్యి రోజుల పాలనలో రాష్ట్రానికి మేలు చేయకపోగా కీడు చేస్తున్నారని మండిపడ్డారు. పాలన చేతకాక కేసీఆర్‌పై విమర్శలు చేస్తున్నారని అన్నారు. కేసీఆర్‌తో రేవంత్‌రెడ్డిని పోల్చుకోవడం నందిని పందితో పోల్చుకోవడమేనని ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ జీతభత్యాలను లెక్కగడుతున్న ప్రభుత్వం.. తమ తమ్ముళ్లకు ఎలాంటి హోదా ఉందో చెప్పాలని ప్రశ్నించారు. పాలనను పక్కనపెట్టి దోచుకోవడం, దాచుకోవడం తప్ప రాష్ట్రానికి ఏం చేశారని నిలదీశారు. రేవంత్‌రెడ్డి రిబ్బన్ కటింగ్ ముఖ్యమంత్రిగా మారారని ఎద్దేవా చేశారు.

**ప్రజల కోసం పోరాటం ఆగదు**

**హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచైనా సరే పోరాటం చేస్తామని ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. ప్రజల కోసం ఉద్యమాలు, పోరాటాలు చేయడం తమకు కొత్త కాదన్నారు. తాము నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి కూడా నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటలకు, చేతలకు పొంతన ఉండాలని హితవు పలికారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజలే తరిమికొడతారని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి, దేవరుప్పుల, కొడకండ్ల, పాలకుర్తి మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, యువజన, సోషల్ మీడియా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.**

# 420 హామీలపై ప్రశ్నిస్తే అరెస్టులా?

- ప్రజా ఉద్యమాలను అరెస్టులతో అడ్డుకోలేరు
- వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లోకి వెళ్తాం
- హామీల అమలుకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు
- మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్



కాకతీయ, హన్మకొండ : ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా? అని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల తరఫున నిరసన చేపడుతుంటే పోలీసులతో అడ్డుకోవడం సరికాదన్నారు. అరెస్టులతో ప్రజా ఉద్యమాలను అడ్డుకోలేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో చెప్పుకోదగిన స్థాయిలో అమలు జరగలేదని ఆరోపించారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని బాండ్ పేపర్లపై హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ప్రజలకు ఇచ్చిన మాటను విస్మరించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో చోటుచేసుకున్న వైఫల్యాలు, ప్రజా సమస్యలపై ఛార్జ్‌షీట్‌ను ప్రజల ముందు ఉంచుతున్నామని వినయ్‌భాస్కర్ తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి కనిపించడం లేదని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో తెలంగాణను అభివృద్ధిలో ముందంజలో నిలిపితే.. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రాన్ని వెనక్కి తీసుకెళ్తోందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసనలు, పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

**అనుమతి ఉన్నా నిరసనకు అడ్డంకులు..**

హామీల అమలును ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హనుమకొండలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి ముందస్తు అనుమతి తీసుకున్నప్పటికీ పోలీసులు అడ్డుకున్నారని వినయ్‌భాస్కర్ తెలిపారు. ఆదాలత్ సర్కిల్ వద్ద తనను పోలీసులు అరెస్టు చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారని చెప్పారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సుబేదారి జంక్షన్‌లో నిరసనను కొనసాగించారని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, హామీలను అమలు చేయాలని డిమాండ్ చేయడం ప్రతిపక్షంగా తమ బాధ్యత అన్నారు. అరెస్టులు, కేసులతో ప్రజా ఉద్యమాలను నిలువరించడం సాధ్యం కాదని పేర్కొన్నారు.
ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని వినయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసన తెలిపే అవకాశం కల్పించాలని కోరారు.
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చే ప్రతి కార్యక్రమాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన వినయ్‌భాస్కర్‌కు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, శాంతియుతంగా నిరసన తెలపడం ప్రతి ఒక్కరి హక్కు అన్నారు. హామీల అమలును ప్రశ్నించిన నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన కేసులు, అరెస్టులను ఉపసంహరించుకోవాలని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



# జూటా పాలనకు కేరాఫ్ రేవంత్ సర్కారు

**అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చారు**

**420 హామీల అమలులో కాంగ్రెస్ దారుణ వైఫల్యం**

**100 రోజులన్నారు.. 1000 రోజులు అయినా అమలు చేయలేదు**

**వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్**

**తొలి రోజు ఇంటింటికీ బాకీ కార్డుల పంపిణీ**



కాకతీయ, వర్ధన్నపేట : అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయమంటే మొహం చాటేస్తోందని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీల అమలులో దారుణంగా విఫలమైందని విమర్శించారు. 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఒక్కొక్క హామీని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన వారం రోజుల పోరుబాటలో భాగంగా తొలి రోజు వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఆకేరు వాగు నుంచి ప్రభుత్వ ఆస్పత్రి, అంబేద్కర్ జంక్షన్ వరకు భారీ ఫ్లెక్సీ ప్రదర్శన నిర్వహించి, ప్రజలకు బాకీ కార్డులను పంపిణీ చేశారు.

**420 హామీలు అమలు చేయాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో పాలన సాగిస్తోం



దని అరూరి రమేశ్ విమర్శించారు. ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పొందుపరిచిన 420 హామీలను ప్రజలకు ఇచ్చిన మాటగా భావించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ఇచ్చిన హామీలను విస్మరిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న పోరుబాటలో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గంలోనూ ప్రజా సమస్యలపై ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి , షాదీముబారక్, కేసీఆర్ కిట్ తదితర సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని అరూరి రమేశ్ ఆరోపించారు. పేదలు, మహిళలు, విద్యార్థులు, రైతులు, సామాన్య ప్రజలకు గతంలో అందిన సంక్షేమ పథకాలు ఇప్పుడు సక్రమంగా అందడం లేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

**ప్రతి గ్రామం, వార్డులో పోరాటం**

వర్ధన్నపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి డివిజన్‌లో బీఆర్ఎస్ పోరుబాట కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అరూరి రమేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును వివరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం ఆగదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.
కాంగ్రెస్ 1000 రోజుల పాలనలో ప్రజలకు జరిగిన అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ చేపట్టిన ఏడు రోజుల పోరుబాటను విజయవంతం చేయాలని అరూరి రమేశ్ కోరారు. తొలి రోజు ఇంటింటికీ బాకీ కార్డుల పంపిణీతో పాటు 420 హామీలను ప్రస్తావిస్తూ భారీ ఫ్లెక్సీ ప్రదర్శన నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎస్ఐఆర్, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి మసూద్, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సహకార సంఘాలను బలోపేతం చేయాలి

**ఆదాయ వనరులు పెంచే ప్రాజెక్టులు గుర్తించండి : కలెక్టర్ సత్య శారద**

కాకతీయ, వరంగల్ ప్రతినిధి : జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఏసిఎస్) ఆర్థిక బలోపేతానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సహకార సంఘాల ఆర్థిక స్థితిగతులు, ఆదాయ వనరుల పెంపుపై చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సహకార సంఘాలు స్వావలంబన సాధించేలా లాభదాయక ప్రాజెక్టులను గుర్తించి అమలు చేయాలన్నారు. గోడౌన్ల నిర్మాణం ద్వారా నిల్వ సామర్థ్యం పెంచడంతో పాటు అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు.మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు, విత్తన శుద్ధి యూనిట్లు, సేంద్రీయ ఎరువుల తయారీ వంటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలన్నారు. సంబంధిత శాఖలు, ఆర్థిక సంస్థలతో సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.సమావేశంలో జిల్లా సహకార అధికారి ఎం నీరజ, డీసీసీబీ సీఈఓ, నాబార్డ్ డీడీఎం, తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో వైఎస్సార్ చెరగని ముద్ర

**కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి**

కాకతీయ,రాయపర్తి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి,దివంగత నాయకుడు డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని పలువురు నాయకులు కొనియాడారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కొండూరు గ్రామంలో వైఎస్సార్ వర్ధంతి వేడుకలను పార్టీ శ్రేణులు, అభిమానులు,గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అలాగే వైఎస్సార్ విగ్రహానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు,యువజన నాయకులు,పెద్ద ఎత్తున వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు ఆటంకం కలిగిస్తే చర్యలు

**ఆత్మకూరు సీఐ బాబులాల్**

కాకతీయ, ఆత్మకూరు : శాంతిభద్రతలకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు సీఐ బాబులాల్ అన్నారు. బుధవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని, నేరాల నియంత్రణకు చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. టాస్క్‌ఫోర్స్ వరంగల్ నుంచి ఆత్మకూరుకు బదిలీపై వచ్చినట్లు చెప్పారు. స్టేషన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని సూచించారు.

## నర్సంపేటలో బీఆర్ఎస్ సమరభేరి

**కాంగ్రెస్ 1000 రోజుల పాలన వైఫల్యాలపై ధ్వజం**

**420 హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ**

కాకతీయ, వరంగల్ ప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలన వైఫల్యాలను ఎండగడుతూ నర్సంపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమరభేరి నిర్వహించారు. నర్సంపేట పట్టణంలో జరిగిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుంచి గులాబీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. కాంగ్రెస్ విధానాలను, 1000 రోజుల పాలనను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సమరభేరిలో మాజీ ఎమ్మెల్యే పెద్ది ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. 100 తప్పులతో శిశుపాలుని తల తెగిపడినట్లు.. 1000 రోజుల పాలనతో 420 హామీల కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని అన్నారు. మూడేళ్ల పాలనలోనే తెలంగాణను 30 ఏళ్లు వెనక్కి నెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని గులాబీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు రాకేష్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మండల నాయకులు రవీందర్, రమేష్‌యాదవ్, గటిక అజయ్‌కుమార్, ఆకుల శ్రీనివాస్, రమాదేవి పాల్గొన్నారు.



# 1000 రోజుల పాలనే మా ప్రోగ్రెస్ రిపోర్ట్

**బీఆర్ఎస్ పాలనలో విద్యారంగం నిర్లక్ష్యం**

**డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో పదేళ్లు కథలు చెప్పారు**

**నిర్మాణాత్మక విమర్శలకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమే**

**అధికారం పోయిందన్న అక్కసుతోనే బీఆర్ఎస్ విమర్శలు**

**వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ధ్వజం**



కాకతీయ, హన్మకొండ : అధికారం కోల్పోయామన్న అక్కసుతోనే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్న తర్వాత ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలని, ప్రతిపక్ష బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. బుధవారం హనుమకొండ డీసీసీ కార్యాలయంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డితో కలిసి ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు.
కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని కావ్య తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల భారంలోకి నెట్టినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తూనే అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. విద్యారంగాన్ని బీఆర్ఎస్ పదేళ్లపాటు నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులను ఉపయోగించుకున్న ఆ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత వారి భవిష్యత్ కోసం ఏం చేసిందని ప్రశ్నించారు. విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్స్‌లర్ల నియామకం, విద్యాశాఖపై ముఖ్యమంత్రి స్థాయిలో సమీక్ష వంటి అంశాలను ప్రస్తావించారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డీఎస్సీ ద్వారా సుమారు 10 వేల మంది ఉపాధ్యాయులను నియమించిందని, వివిధ శాఖల్లో సుమారు 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా సుమారు రూ.60 వేల కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయిందని విమర్శిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తొలి దశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. కేసీఆర్‌కు రాజకీయ అనుభవం ఉందని, నిర్మాణాత్మక సూచనలు చేస్తే ప్రభుత్వం స్వీకరించేందుకు సిద్ధంగా ఉందని కావ్య తెలిపారు. ప్రతిరోజూ రాజకీయ విమర్శలు చేయడం కంటే ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చించేందుకు ప్రతిపక్షాలు ముందుకు రావాలని సూచించారు.
"చెప్పినవి చేస్తున్నాం.. చెప్పనివి కూడా చేస్తున్నాం. 1000 రోజుల కాంగ్రెస్ పాలనే మా ప్రోగ్రెస్ రిపోర్ట్" అని ఎంపీ డా. కడియం కావ్య స్పష్టం చేశారు. అనంతరం మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

## పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టండి

కాకతీయ, వరంగల్ ప్రతినిధి: గ్రేటర్ వరంగల్ పరిధిలో ఆస్తి, నీటి పన్నుల వసూళ్లకు పక్కా ప్రణాళికతో లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు సాగాలని జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ ఐడీఓసీలో కమిషనర్ టి. వెంకన్నతో కలిసి ట్యాక్సేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సర్కిల్ వారీగా పన్నుల వసూళ్లు, కొత్త అసెస్‌మెంట్లు, డ్రోన్ సర్వే, జియోట్యాగింగ్‌పై సమీక్షించారు. ప్రతి ఆస్తిని జియోట్యాగ్ చేసి డిజిటల్ రికార్డుతో అనుసంధానం చేయాలని సూచించారు. డ్రోన్ సర్వేలో గుర్తించిన నిర్మాణాలను క్షేత్రస్థాయి రికార్డులతో సరిపోల్చి పన్ను పరిధిలోకి తేవాలన్నారు. కమర్షియల్, ప్రభుత్వ భవనాలు, సెల్‌టవర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, డబుల్ అసెస్‌మెంట్లు, నాన్-కలెక్టబుల్ డిమాండ్లను వారంలోగా నివేదించాలని ఆదేశించారు. వెనుకబడిన వార్డుల్లో ప్రత్యేక బృందాలతో రోజువారీ పర్యవేక్షణ చేపట్టాలని జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు.

# సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

- కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి
- 2029లో రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయం
- పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పనిచేసే వారికే గౌరవం
- కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపు



కాకతీయ, జనగామ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. లింగాల ఘనపూర్ మండలంలో నిర్వహించిన కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
గ్రామ స్థాయి నుంచి దేశ స్థాయి వరకు కాంగ్రెస్ శ్రేణులు కలిసి కట్టుగా పనిచేస్తే 2029లో రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని కడియం శ్రీహరి అన్నారు. కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని పేర్కొన్నారు. పాత, కొత్త అనే తేడాలు లేకుండా పార్టీ నిబంధనలకు అనుగుణంగా పనిచేసే వారికే తన వద్ద గౌరవం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు గతంలో తమపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని కడియం శ్రీహరి విమర్శించారు. కవిత చేసిన అవినీతి ఆరోపణలపై ముందుగా బీఆర్ఎస్ నేతలు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని, గత 12 ఏళ్లలో ప్రధాని మోదీ తెలంగాణకు ఒక్క ప్రాజెక్టు లేదా రూ.వెయ్యి కోట్ల నిధులు కూడా ఇవ్వలేదని ఆరోపించారు.

**ప్రతి గ్రామానికి రెండు పంటలకు సాగునీరు**

లింగాల ఘనపూర్ మండలంలోని ప్రతి గ్రామానికి రెండు పంటలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జీడికల్ రోడ్డు నిర్మాణంతో పాటు కోడూరు, కన్నాయిపల్లి, చీటూరు రోడ్లను త్వరలో పూర్తి చేయిస్తానన్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులను నిషేధించేందుకు గ్రామసభల్లో తీర్మానాలు చేయాలని సూచించారు. యువత గంజాయికి బలి కాకుండా గ్రామస్థాయిలో సామాజిక బాధ్యతతో చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఇందిరా, నాయకులు గుడి వంశీధర్‌రెడ్డి, కిసర దిలీప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శివకుమార్, మండల అధ్యక్షుడు సాధం విజయ్ మనోహర్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేర చరిత్ర ఉన్నవారిపై నిఘా ఉంచుతాం

భూ వివాదాల కేసుల్లో ఎస్ఓపీనే ప్రామాణికం

వరంగల్ పోలీసింగ్ వేరు.. అర్బన్, రూరల్ బ్యాలెన్సే ఇక్కడ కీలకం

గంజాయిపై ఉక్కుపాదం.. 'సంఘమిత్ర'లతో సమరమే!

ట్రాఫిక్ క్రమబద్ధీకరణ.. అవసరమైన చోట నిర్ణయం

ప్రజల సేఫ్టీనే మొదటి లక్ష్యం.. శాఖలతో కలిసి ముందుకు

ఫేమ్ కోసం కాదు.. ఫలితం కోసం పనిచేస్తా

డిజిటల్ మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో వరంగల్ సీపీ శ్వేతారెడ్డి

# రౌడీయిజానికి నో ఛాన్స్!



"పోలీస్ అధికారిగా నాకు పేరు రావాలి.. ఫేమ్ రావాలి అనే ఆలోచన లేదు. నేను చేసే పనికి ఫలితం కనిపించాలి. ప్రజలకు భద్రత ఉందనే నమ్మకం కలగాలి. నేరస్తులకు చట్టం పట్ల భయం ఉండాలి. అదే నా పోలీసింగ్ నిర్వచనం".. వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి తన వర్క్ స్టైల్‌ను ఆవిష్కరించారు. అర్బన్, రూరల్ ప్రాంతాల ప్రత్యేకతలను సమన్వయం చేసుకుంటూ వరంగల్ పోలీసింగ్‌కు ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తున్నానని చెప్పారు. గంజాయి, రౌడీయిజం, సైబర్ క్రైం, ట్రాఫిక్, భూ వివాదాలు వంటి అంశాలతోపాటు సాంకేతికత వినియోగం, శాఖల మధ్య సమన్వయం, ప్రజల భాగస్వామ్యానికీ ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. డిజిటల్ మీడియా ప్రతినిధులు నిర్వహించిన చిట్‌చాట్‌లో వరంగల్ సీపీ శ్వేతారెడ్డి వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో అమలు చేస్తున్న పోలీస్ విధానాలపై కొన్నింటిని చిట్‌చాట్‌లో వెల్లడించారు. ఆ వివరాలు సీపీ మాటల్లోనే..

### గంజాయిపై ఉక్కుపాదం.. 'సంఘమిత్ర'లతో సమరమే!

"గంజాయి విషయంలో నేను చాలా సీరియస్‌గా పనిచేస్తున్నాం. ఇది కేవలం పోలీసుల సమస్యగా చూడను. ఒక యువకుడు మత్తుకు బానిస అయితే దాని ప్రభావం ఒక్క వ్యక్తిపైనే కాదు.. మొత్తం కుటుంబంపైన, సమాజంపైన పడుతుంది. అందుకే నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ గంజాయి వినియోగం, సరఫరాపై ప్రత్యేక నిఘా పెట్టాం. పదేపదే గంజాయి కేసుల్లో పట్టుబడుతున్నవారి కదలికలను నిశితంగా గమనిస్తున్నాం. అవసరమైన చోట రౌడీషీట్లు కూడా ఓపెన్ చేస్తున్నాం. అయితే పోలీసులు ఎంత పనిచేసినా ప్రజల సహకారం లేకుండా గంజాయి సరఫరాను పూర్తిగా అరికట్టడం కష్టం. అందుకే మహిళా సంఘాలను 'సంఘమిత్రలు'గా భాగస్వాములను చేస్తున్నాం. ప్రతి గ్రామంలో మహిళా సంఘాలు ఉండటంతో క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించడంతో పాటు యువతను మత్తు నుంచి దూరంగా ఉంచే అవగాహన పెంచవచ్చు. గంజాయి సరఫరా చేసే వ్యక్తులు, ప్రాంతాలు, వాహనాలపై పక్కా సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

### రౌడీయిజానికి నో ఛాన్స్.. నేర చరిత్రపై నిఘా

వరంగల్‌లో రౌడీయిజానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వం. నేర చరిత్ర ఉన్న వ్యక్తులు మళ్లీ అదే మార్గంలోకి వెళ్లకుండా వారి కదలికలపై నిరంతరం నిఘా ఉంటుంది. అవసరమైన చోట చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. రౌడీయిజం అనేది కేవలం ఒక వ్యక్తి చేసే నేరం కాదు.. దాని ప్రభావం చుట్టుపక్కల ప్రజలపై పడుతుంది. ఒక కాలనీలో కొందరు వ్యక్తులు భయాందోళనలు సృష్టిస్తే సాధారణ ప్రజలు స్వేచ్ఛగా జీవించే పరిస్థితి ఉండదు. అలాంటి వాతావరణాన్ని సహించేది లేదు. నేరం చేసిన తర్వాత చర్య తీసుకోవడం ఒక విధానం అయితే.. నేరం పునరావృతం కాకుండా ముందుగానే గుర్తించడం మరో ముఖ్యమైన విధానం. నేను రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తాను. నేర చరిత్ర ఉన్న వ్యక్తులపై నిఘా, పెట్రోలింగ్, స్థానిక సమాచారం సేకరణను బలోపేతం చేస్తాం. చట్టాన్ని అతిక్రమిస్తే ఎంత ప్రభావం ఉన్న వ్యక్తి అయినా నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తాం" అని సీపీ స్పష్టం చేశారు.

### ప్రజల సేఫ్టీనే మొదటి లక్ష్యం.. శాఖలతో కలిసి ముందుకు

నా పోలీసింగ్‌లో ప్రజల భద్రతకు మొదటి ప్రాధాన్యం. ట్రాఫిక్, ఫ్రీ లెఫ్ట్‌లు, ఫుట్‌పాత్ ఆక్రమణలు వంటి సమస్యలను ఒక్కసారిగా పరిష్కరించలేకపోయినా విడతల వారీగా ముందుకు వెళ్తాం. పోలీసు శాఖ ఒక్కటే అన్ని సమస్యలను పరిష్కరించలేదు. కొన్ని సమస్యలకు మున్సిపల్ కార్పొరేషన్ సహకారం అవసరం.. మరికొన్నింటికి ఎక్సైజ్, రెవెన్యూ శాఖల సమన్వయం అవసరం. ఇప్పటికే కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించాం. శాఖల మధ్య సమన్వయం లేకపోతే ఒక శాఖ తీసుకున్న నిర్ణయం మరో సమస్యకు దారితీయవచ్చు. అందుకే అందరినీ కలుపుకొని పనిచేయాలి. అదే సమయంలో ప్రజల భాగస్వామ్యం కూడా చాలా ముఖ్యం. అధికారులు తమ వంతు బాధ్యత నిర్వర్తించినా ప్రజలు సహకరించకపోతే శాశ్వత పరిష్కారం సాధ్యం కాదు. పోలీసింగ్ అంటే పోలీస్ స్టేషన్ గోడల మధ్య జరిగే వ్యవహారం కాదు.. ప్రజలతో కలిసి నడిచే వ్యవస్థ. ఆ దిశగానే నా పని తీరు ఉంటుంది.

### మిల్స్ కాలనీపై ప్రత్యేక ఫోకస్.. క్రైం కంట్రోల్ ముఖ్యం

ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ఒకే విధమైన సమస్యలు ఉండవు. ఏ ప్రాంతంలో ఎలాంటి నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయో ముందుగా తెలుసుకోవాలి. మిల్స్ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రైం కేసులు ఎక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో అక్కడ ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. అదనపు ఎస్ఐని నియమించి క్రైం కంట్రోల్, పెట్రోలింగ్, నిఘాను మరింత బలోపేతం చేస్తున్నాం. నాకు పోలీసింగ్ అంటే కేవలం కేసులు నమోదు చేయడం కాదు.. కేసులు ఎందుకు జరుగుతున్నాయో తెలుసుకోవడం, వాటిని ముందుగానే నియంత్రించే వ్యవస్థను ఏర్పాటు చేయడం. మిల్స్ కాలనీతో పాటు మట్వాడ, ఇంతేజార్‌గంజ్ ప్రాంతాల్లో క్రైం కేసులు ఎక్కువగా ఉంటే.. కేయూ, హసన్‌పర్తి ప్రాంతాల్లో భూ వివాదాలకు సంబంధించిన కేసులు అధికంగా ఉన్నాయి. అందుకే సమస్య ఉన్న చోటుకు తగ్గట్టుగా పోలీసింగ్ ఉండాలి. ప్రతి స్టేషన్‌కు ఒకే ఫార్ములా కాకుండా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహం రూపొందిస్తున్నాం" అని సీపీ వివరించారు.

### సైబర్ నేరాల్లో బాధితుడికి న్యాయం.. దర్యాప్తే కీలకం

సైబర్ క్రైం ప్రస్తుతం ప్రతి ప్రాంతానికీ సవాలుగా మారింది. వరంగల్ కమిషనరేట్‌లోనూ సైబర్ నేరాల సంఖ్య ఎక్కువగానే ఉంది. ఒక వ్యక్తి సైబర్ మోసానికి గురైనప్పుడు డబ్బు పోవడంతో పాటు మానసికంగా కూడా తీవ్రంగా ఇబ్బంది పడతారు. అందుకే బాధితుడికి న్యాయం జరిగేలా కేసును ప్రాపర్‌గా ఇన్వెస్టిగేట్ చేయడంపై దృష్టి పెడుతున్నాం. సైబర్ నేరాల్లో సమయం చాలా కీలకం. కేసు నమోదైన తర్వాత దర్యాప్తును వేగంగా ముందుకు తీసుకెళ్లాలి. ఆధారాలను సేకరించడం, నేరానికి సంబంధించిన లింకులను గుర్తించడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. పోలీసింగ్‌లో సాంకేతికత పెరుగుతున్న కొద్దీ నేరాల స్వభావం కూడా మారుతోంది. అందుకు అనుగుణంగా మన దర్యాప్తు విధానం కూడా మారాలి. సైబర్ నేరాల విషయంలో ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు నేరం జరిగినప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించేలా చైతన్యం కల్పించాలి.

### స్టేషన్ వారీగా క్రైం మ్యాపింగ్..

వరంగల్ కమిషనరేట్ మొత్తం ఒకే రకమైన ప్రాంతం కాదు. ప్రతి పోలీస్‌స్టేషన్‌కు తనదైన క్రైం ప్యాటర్న్ ఉంటుంది. అందుకే స్టేషన్ వారీగా నమోదవుతున్న కేసుల స్వభావాన్ని పరిశీలిస్తున్నాం. మిల్స్ కాలనీ, మట్వాడ, ఇంతేజార్‌గంజ్ ప్రాంతాల్లో క్రైం కేసులు ఎక్కువగా ఉంటే.. కేయూ, హసన్‌పర్తి ప్రాంతాల్లో భూ వివాదాలు అధికంగా ఉన్నాయి. ఈ సమాచారాన్ని కేవలం గణాంకాలుగా చూడటం లేదు. ఆ గణాంకాల వెనుక ఉన్న కారణాలను గుర్తించాలి. ఏ ప్రాంతంలో ఏ సమయంలో ఎలాంటి నేరాలు జరుగుతున్నాయి? ఎలాంటి వ్యక్తులు ఎక్కువగా నేరాలకు పాల్పడుతున్నారు? వంటి అంశాలను పరిశీలించి నివారణ చర్యలు చేపడుతున్నాం. ఇది క్రైం మ్యాపింగ్ ద్వారా మరింత స్పష్టమవుతుంది. నా దృష్టిలో మంచి పోలీసింగ్ అంటే నేరం జరిగిన తర్వాత స్పందించడం మాత్రమే కాదు.. నేరం జరిగే అవకాశాలను ముందుగానే గుర్తించి అడ్డుకోవడం. అందుకే డేటా ఆధారిత పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాం.

### సీసీ కెమెరాలపై నిఘా.. ప్రతి ప్రాంతం మరింత సేఫ్‌గా


నియంత్రణలో సీసీ కెమెరాలు చాలా కీలకంగా మారాయి. ఒక నేరం జరిగిన తర్వాత నిందితుడిని గుర్తించడంలోనే కాదు.. నేరం ఎలా జరిగింది అనే విషయాన్ని తెలుసుకోవడంలోనూ కెమెరాలు ఉపయోగపడతాయి. అందుకే నగరంలోని కాలనీలు, ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టాం. కెమెరాలు ఏర్పాటు చేసి వదిలేయడం కాదు.. అవి పనిచేస్తున్నాయా? నిర్వహణ సక్రమంగా జరుగుతోందా? అనే విషయాలను నిరంతరం పరిశీలించాలి. సంబంధిత పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలకు కెమెరాల నిర్వహణ, పనితీరుపై బాధ్యత అప్పగించాం. అవసరమైన చోట కాలనీ సమావేశాలు నిర్వహించి ప్రజలకు కూడా బాధ్యతను వివరించాలి. పోలీసులకు ప్రతి చోట కళ్లుండవు. కానీ సమర్థంగా పనిచేసే సీసీ కెమెరా వ్యవస్థ పోలీసింగ్‌కు అదనపు కళ్లలా పనిచేస్తుంది. అందుకే దీనిని మరింత బలోపేతం చేయాలన్నది నా ఉద్దేశం.

### ట్రాఫిక్ క్రమబద్ధీకరణ.. అవసరమైన చోట నిర్ణయం

వరంగల్ నగరంలో ట్రాఫిక్ సమస్యను ఒక్కరోజులో పరిష్కరించలేం. ఇది నిరంతరం కొనసాగుతున్న అంశం. అయితే సమస్య ఉన్న ప్రాంతాన్ని గుర్తించి అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలి. యూటర్న్‌లు, ఫ్రీ లెఫ్ట్‌లు, రోడ్డు సేఫ్టీ వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. కరుణాపురంలో వైన్స్‌కు పెద్ద పర్మిట్ రూమ్ ఉండటంతో ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై ఎక్సైజ్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుని మూడు యూటర్న్‌లను మూసివేశాం. దాని ఫలితంగా ప్రస్తుతం ట్రాఫిక్ సాఫీగా సాగుతోంది. నాకు ఒక విషయం స్పష్టంగా ఉంది.. ట్రాఫిక్ విషయంలో పోలీసులు మాత్రమే పనిచేస్తే సరిపోదు. వాహనదారులు నిబంధనలు పాటించాలి. ప్రజలు కూడా సహకరించాలి. రోడ్డు భద్రత అనేది అందరి బాధ్యత. ఎక్కడ సమస్య ఉంటే అక్కడి పరిస్థితిని అధ్యయనం చేసి దశలవారీగా పరిష్కరించుకుంటూ వెళ్తాం.

### భూ వివాదాల్లో ఎస్ఓపీనే ప్రామాణికం

భూ వివాదాలు చాలా సున్నితమైన అంశాలు. ఇలాంటి సమస్యల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎవరి పరిధిలో వారు నిబంధనల ప్రకారం వ్యవహరించాలి. ప్రభుత్వం, పోలీసు శాఖ రూపొందించిన ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌నే ప్రామాణికంగా తీసుకోవాలని అధికారులకు స్పష్టంగా చెబుతున్నాను. ఎవరైనా ఏకపక్షంగా జోక్యం చేసుకుంటే సమస్య మరింత జటిలమవుతుంది. అందుకే ఎస్ఓపీ ప్రకారం ముందుకు వెళ్లడం ముఖ్యం. నేను కూడా అదే విధానాన్ని పాటిస్తాను. చట్టం ఇచ్చిన పరిధిలోనే పోలీసింగ్ ఉంటుంది. ఎవరికి అనుకూలంగా, ఎవరికి వ్యతిరేకంగా పనిచేయడం నా విధానం కాదు. ఆధారాలు, నిబంధనలు, చట్టపరమైన ప్రక్రియ ఆధారంగానే నిర్ణయాలు ఉంటాయి. భూ వివాదాల్లో పారదర్శకత ఉంటేనే ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవు.



**'సంఘమిత్ర'లతో గ్రామస్థాయిలో గంజాయిపై నిఘా**

గంజాయి నియంత్రణలో మహిళా సంఘాల భాగస్వామ్యం నాకు చాలా ముఖ్యమైన అంశం. ప్రతి గ్రామంలో మహిళా సంఘాలు అందుబాటులో ఉంటాయి. వారికి తమ ప్రాంతంలోని కుటుంబాలు, యువత, సామాజిక పరిస్థితులపై సహజంగానే అవగాహన ఉంటుంది. అందుకే వారిని కేవలం అవగాహన కార్యక్రమాలకు పరిమితం చేయకుండా 'సంఘమిత్రలు'గా భాగస్వామ్యం చేస్తున్నాం. గంజాయి వినియోగం ఎక్కడ పెరుగుతోంది? ఎవరైనా యువతను మత్తు పదార్థాల వైపు తీసుకెళ్తున్నారా? వంటి విషయాలపై గ్రామస్థాయిలో అవగాహన పెంచాలి. తాజాగా జనగామలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించి ఈ అంశాలపై వివరించాం. తల్లులుగా మత్తు పదార్థాల ప్రభావాన్ని వారు బాగా అర్థం చేసుకోగలరు. పోలీసులకు చేరని సమాచారం కూడా కొన్నిసార్లు సమాజంలోనే ఉంటుంది. అలాంటి సమాచారాన్ని బాధ్యతాయుతంగా పోలీసులకు చేరేలా వ్యవస్థను రూపొందించడమే మా ఉద్దేశం. ప్రజలను పోలీసింగ్‌లో భాగస్వాములను చేస్తేనే గంజాయిపై పోరాటం మరింత బలపడుతుంది.



**సాంకేతికతే కొత్త ఆయుధం.. ఏఐపై దృష్టి**

కాలం మారుతున్నకొద్దీ పోలీసింగ్ కూడా మారాలి. నేరస్తులు సాంకేతికతను ఉపయోగిస్తున్నప్పుడు పోలీసులు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి. పరిపాలన, పోలీసింగ్‌ను మరింత పటిష్టం చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతికతను వినియోగించుకునేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. రాష్ట్ర స్థాయిలో తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా ఏఐని సమర్థంగా ఉపయోగించుకుని ప్రజలకు మరింత విస్తృతమైన సేవలు అందించే అవకాశాలను పరిశీలిస్తాం. ఇప్పటికే వాట్సాప్ ద్వారా ఎఫ్ఐఆర్‌లు స్వీకరిస్తున్నాం. ప్రజలు పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా అందుబాటులో ఉన్న సాంకేతిక మార్గాలను ఉపయోగించుకోవడం భవిష్యత్తులో మరింత పెరగాలి. అయితే టెక్నాలజీ ఎంత వచ్చినా మానవీయ కోణాన్ని మర్చిపోకూడదు. ప్రజల సమస్యను వినడం, వారికి భరోసా ఇవ్వడం పోలీసింగ్‌లో ఎప్పటికీ ముఖ్యమే. సాంకేతికత మన పనిని వేగవంతం చేయాలి.. ప్రజలతో మన అనుబంధాన్ని తగ్గించకూడదు.

**వరంగల్ పోలీసింగ్ వేరు.. అర్బన్, రూరల్ బ్యాలెన్సే కీలకం**

వరంగల్ ప్రాంతంలో నేను తొలిసారిగా పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తున్నాను. గతంలో ఒకసారి వచ్చి 15 రోజులు డ్యూటీ చేశాను. వరంగల్‌కు చారిత్రక ప్రాధాన్యం ఉంది. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో ప్రధాన నగరంగా ఎదిగిన ఈ ప్రాంతంలో అర్బన్, రూరల్ రెండు రకాల పరిస్థితులు ఉన్నాయి. అందుకే ఇక్కడి పోలీసింగ్ కూడా ప్రత్యేకంగా ఉండాలి. హైదరాబాద్ పూర్తిగా అర్బన్ ప్రాంతం. అక్కడి సమస్యలు, ఇక్కడి సమస్యలు ఒకేలా ఉండవు. నగరంలో ట్రాఫిక్, సైబర్ క్రైం, పట్టణ నేరాలు ఒకవైపు ఉంటే.. గ్రామీణ ప్రాంతాల్లో భూ వివాదాలు, గంజాయి సరఫరా వంటి సమస్యలు మరోవైపు ఉంటాయి. ఈ రెండు ప్రాంతాల అవసరాలను బ్యాలెన్స్ చేస్తూ పనిచేయడమే నా ముందున్న ప్రధాన సవాలు. వరంగల్ పోలీసింగ్‌కు ఒక ప్రత్యేకమైన విధానాన్ని తీసుకురావాలన్నది నా ఆలోచన. సమస్య వచ్చినప్పుడు స్పందించడం మాత్రమే కాకుండా.. సమస్య ఎక్కడి నుంచి మొదలవుతుందో గుర్తించి ముందుగానే నియంత్రించే పోలీసింగ్ ఉండాలి.

**ఫేమ్ కోసం కాదు.. ఫలితం కోసం**

పోలీస్ అధికారిగా నాకు ఫేమ్ రావాలి.. పేరు రావాలి అనే ఉద్దేశం లేదు. నేను చేసే పని ప్రజలకు కనిపించాలి. ఒక ప్రాంతంలో నేరాలు తగ్గితే అదే నాకు ఫలితం. ఒక బాధితుడికి న్యాయం జరిగితే అదే నాకు సంతృప్తి. ఒక కుటుంబం భయపడకుండా బయటకు వెళ్లగలిగితే అదే మంచి పోలీసింగ్‌కు గుర్తింపు. నాకు చట్టంపై పూర్తి నమ్మకం ఉంది. చట్టాన్ని నమ్మి, దాని ప్రకారమే విధులు నిర్వర్తిస్తాను. అదే సమయంలో శిక్ష పడే వరకు వేచి చూసే ఓపిక కూడా ఉండాలి. ప్రతి కేసులోనూ వెంటనే ఫలితం రావాలని కాదు.. కానీ దర్యాప్తు సరైన దిశలో సాగాలి. పోలీసింగ్ ప్రభావవంతంగా ఉండటమే కాదు.. దాని ఫలితం ప్రజలకు అనుభూతి కావాలి. నేరస్తులకు చట్టం ఉందనే భయం, సాధారణ ప్రజలకు పోలీసులున్నారనే భరోసా కలిగించడమే పోలీసుల పని తీరుకు అసలు కొలమానం. వరంగల్‌లో పోలీసింగ్ అంటే ప్రజలకు భరోసా.. నేరస్తులకు చట్టంపై భయం ఉండేలా చేయడమే నా లక్ష్యం" అని సీపీ శ్వేతారెడ్డి స్పష్టం చేశారు.

ఉత్తరం కాకతీయ ఎడిటర్/
- కిరణ్ గౌడ్ అరెల్లి
7396604266

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266